క్లుప్తంగా

సాయినాథుడికి పూజలు



పల్లకి సేవలో పాల్గొన్న భక్తులు

వీరపునాయునిపల్లె : మండలంలోని వేంపల్లె, ఎర్రగుంట్ల ప్రధాన రహదారిలోని పాలగిరి క్రాస్ వద్ద వెలసిన సాయిబాబా ఆలయంలో గురువారం ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మూల మూర్తిని అలంకరించారు. భక్తులు పూజలు నిర్వహించడంతో పాటు సాయి భజనలు నిర్వహించారు. ఆలయం చుట్టూ నిర్వహించిన పల్లకి సేవలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఓబుల్‌రెడ్డిపల్లె గ్రామానికి చెందిన గంగరాజు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేత్రదానం



మృతుడి కుటుంబ సభ్యుల నుంచి కార్నియాలను అందుకుంటున్న రాజు

వేముల : ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసి అంధ రహిత సమాజం కోసం పాటుపడాలని నేత్ర సేకరణ కేంద్ర అధ్యక్షుడు రాజు తెలిపారు. గురువారం మండలంలోని నారేపల్లె గ్రామానికి చెందిన ఓబుళరెడ్డి నరసింహారెడ్డి మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. రాజు టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని ఇంటికి వెళ్లి మృతదేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్ర నిధికి పంపించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసి పోయే నేత్రాలు దానం చేసేందుకు ప్రతి కుటుంబం ముందుకు రావాలన్నారు.

గండికోటను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం



గండికోటను సందర్శిస్తున్న కేంద్రమంత్రి

జమ్మలమడుగు : ఎంతోఘన చరిత్ర కలిగిన పర్యాటక కేంద్రం గండికోట. అలాంటి గండికోటను పర్యాటకంగా అన్నివిధాలుగా తీర్చిదిద్దడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గురువారం ఆయన ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డిలతో కలిసి గండికోటను సందర్శించారు. పర్యాటకంగా గండికోటను తీర్చి దిద్దితే ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. కేంద్ర ప్రభుత్వం గండికోట అభివృద్ధికి రూ.78 కోట్లు కేటాయించింది. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పెద్దమ్మ, చిన్నమ్మ దేవర



పెద్దమ్మ, చిన్నమ్మలకు పూజలు చేస్తున్న ప్రజలు

జమ్మలమడుగు : మైలవరం మండలం నవాబుపేట గ్రామానికి చెందిన పెద్దమ్మ చిన్నమ్మల దేవర వైభవంగా నిర్వహించారు. గురువారం అమ్మవార్లకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను గ్రామస్తులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిలు అమ్మవార్లను సందర్శించి ప్రత్యేక పూజలను నిర్వహించారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : గిరిజన సామాజిక వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని గిరిజన ఐక్య వేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సొరకాయల శివశంకర్ కోరారు. ఈ మేరకు ఆయన గురువారం కడపకు వచ్చిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ శాఖలలో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని, గిరిజన తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలపై స్పెషల్ వెరిఫికేషన్ చేయించాలని, తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు పొంది ఉద్యోగాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలని, జిల్లాల వారిగా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్లను ఏర్పాటు చేయాలని, గిరిజన కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. వీటితోపాటు ఇతర సమస్యలు పెండింగ్‌లో ఉన్న వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆయన మంత్రిని కోరారు.

ఘనంగా వైఎస్ రాజారెడ్డి శత జయంతి వేడుకలు



వేంపల్లెలో వృద్ధులకు అన్నదానం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ, మండల కన్వీనర్



సింహాద్రిపురంలో వైఎస్ రాజారెడ్డి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న తదితరులు



లింగాలలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వేంపల్లె : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి తండ్రి వైఎస్ రాజారెడ్డి శత జయంతి వేడుకలను వేంపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం వైఎస్ రాజారెడ్డి శత జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డిల ఆధ్వర్యంలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక రాజీవ్ కాలనీలో ఉన్న అమ్మ అనాథ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. గతంలో వైఎస్ రాజారెడ్డి పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, అలాగే పాత గండి రోడ్డులోని మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో చక్రాయపేట వైఎస్సార్‌సీపీ మండల నాయకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చక్రాయపేట జెడ్పీటీసీ శివప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ బెల్లం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు మునీర్, రవిశంకర్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ యువనాయకులు సింగారెడ్డి రోహన్ నాగిరెడ్డి, ఎంపీపీ మాధవిబాలకృష్ణ, జనరల్ సెక్రటరీ ఈశ్వర్ రెడ్డి, గండి దేవస్థాన సభ్యులు రామాంజనేయరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బీఎస్ షేక్షావలి, కటిక చంద్రశేఖర్, కమతం రాజా, భారతి, సల్మా, అసానయ్య, బ్రహ్మయ్య, నరసింహగౌడ్, మునేష్, బాబాషరీఫ్, మటన్ బాబా, షామీర్‌బాషా, ముత్యాల రమేష్, కటిక నాగేంద్ర, బ్రహ్మయ్యలతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : వైఎస్ రాజారెడ్డి శతజయంతి వేడుకలను గురువారం మండలంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ రాజారెడ్డి శత జయంతిని పురస్కరించుకుని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెన్నపూస రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పులివెందుల ప్రాంత పేద ప్రజల కోసం 1970 లోనే అధునాతన ఆసుపత్రిని నిర్మించి సేవలను అందించారని కొనియాడారు. పులివెందుల ప్రాంతంలో అందరూ విద్యావంతులు కావాలనే ఉద్దేశంతో సింహాద్రిపురంలో వైఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాల, పులివెందులలో వైఎస్ఆర్ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలను నెలకొల్పి కొన్ని వేల మంది విద్యావంతులను తయారు చేయడంవల్ల ఎంతోమంది ఉన్నత స్థాయిలో రాణిస్తున్నారన్నారు. పులివెందుల ప్రాంత అభివృద్ధి కోసం దివంగత వైఎస్ రాజారెడ్డి తన వంతు కృషి చేశారన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కిశోర్ రెడ్డి, అరవిందనాథరెడ్డి, బీఎస్ బ్రహ్మానందరెడ్డి, సోమేశ్వర్‌రెడ్డి, బాబురెడ్డి, కృష్ణారెడ్డి, కృపాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, సర్పంచులు ఆర్.శివారెడ్డి, బి.శివారెడ్డి, కంభం మహేశ్వరరెడ్డి, రామ్మోహన్, ద్వారకనాథ రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సోమ శేఖర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రహ్లాదరెడ్డి, ఎంపీటీసీలు ముల్లా జాఫర్, రాజబాబు, మండల కో ఆప్షన్ నెంబర్ నజీర్, వైఎస్సార్‌సీపీ నాయకులు వి.సుదర్శన్ రెడ్డి, కృష్ణారెడ్డి, మధురెడ్డి, రుషికేశవరెడ్డి, చేన్నకేశవ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, ఘన శ్యాం సుందర్‌రెడ్డి, సురేష్, కిశోర్‌రెడ్డి, బాబురెడ్డి, మల్లికార్జునరెడ్డి, సి.కె.బాబురెడ్డి, విశ్వనాథ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, మైనార్టీ నాయకులు ముల్లా బషీర్, షబ్బీర్, గౌస్, గౌస్ పీర్, ముల్లా బిలాల్, హాజీవ్ అలీ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ నాయకులు గంగాధర్, ప్రసాద్, మహేష్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

లింగాలలో..

లింగాల : మండలంలో గురువారం దివంగత నాయకుడు వైఎస్ రాజారెడ్డి శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్ రాజారెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాబురెడ్డి మాట్లాడుతూ వైఎస్ రాజారెడ్డి ప్రజలకు అండదండలుగా ఉండి ఆదుకున్నారన్నారు. అదేవిధంగా పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో ఎన్నో అభివృద్ధి పనులు నిర్వహించి పులివెందుల తాలుకా ప్రజల మన్ననలు పొందిన వ్యక్తి వైఎస్ రాజారెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల వ్యవసాయ కన్వీనర్ సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఇప్పట్ల గ్రామ ఉప సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేంద్రనాథరెడ్డి, అశోక్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అంకాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరులో

ముద్దనూరు : దివంగత నేత వైఎస్ రాజారెడ్డి 100వ జయంతి సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు ఘన నివాళులర్పించారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు వైఎస్ రాజారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, రామకోటిరెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

పుష్పగిరి పీఠం భూముల వేలం

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ పుష్పగిరి మఠానికి చెందిన ఆస్తుల వేలం గురువారం నిర్వహించినట్లు మఠం మేనేజర్ పి.గిరిధర్ తెలిపారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలోని పెద్దపప్పూరు గ్రామంలోని సర్వే నెంబరు 210లోగల విస్తీర్ణం ఏ7.10 సెంట్ల భూమిని గురువారం వేలం వేశామని ఆయన వివరించారు. ఉదయం స్థానిక జయనగర్ కాలనీలోని శ్రీ పుష్పగిరిమఠం మేనేజర్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, సి.సిద్దయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వేలం పాట ద్వారా రూ. 2,22,000 గుత్త లభించినట్లు ఆయన వివరించారు. 2018 కన్నా ఈ ఏడాది ఎక్కువ మొత్తం లభించినట్లు ఆయన వివరించారు.

సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఆల్‌మేవా రాష్ట్ర చైర్మెన్ డాక్టర్ ఎస్ఏఎస్ ఫరూర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జలీల్‌ఖాన్, నజీర్‌బాషలు పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని ఆల్‌మేవా జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగులకు ఇవ్వవలసిన డీఏలు, 12వ వేతన సవరణతోపాటు ఐఆర్‌లను ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే 2004 నవంబర్ 1వ తేదీ తరువాత ఉద్యోగంలో చేరిన ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలన్నారు. ఇప్పటికే 12వ వేతన సవరణ, డీఏలు, ఐఆర్‌ల కోసం ఉద్యోగులు ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారన్నారు. నేడు విజయవాడలో జరిగే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఈ సమస్యలపై చర్చించాలన్నారు. ఈ సమావేశంలో ఆల్‌మేవా జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఖాజా మొహిద్దీన్, సెక్రటరీ మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నేటి నుంచి వేరుశనగ విత్తన నమోదు ప్రారంభం

వీరపునాయునిపల్లె : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో నేటి నుంచి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ విత్తన నమోదు ప్రక్రియ ప్రారంభించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు తెలిపారు. గురువారం ఆయన తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలానికి 360 క్వింటాళ్ల విత్తన కాయలు మంజూరైనట్లు తెలిపారు.

ఈ విత్తన కాయలను 40 శాతం రాయితీతో అందిస్తామన్నారు. కె6 మరియు టి.సి.జి.ఎస్ 1694 రకాలు అందుబాటులో ఉన్నాయని క్వింటాల్ పూర్తి ధర రూ.9300 ప్రభుత్వం రాయితీ రూ.3720లు, రైతు వాటా రూ.5,580 చెల్లించాల్సి ఉంటుందన్నారు. అర్థ ఎకరా విస్తీర్ణం వరకు 30 కేజీల బ్యాగు ఒకటి, ఎకరా విస్తీర్ణం వరకు 30 కేజీల బ్యాగులు 2, ఎకరం లేదా అంతకన్నా ఎక్కువ విస్తీర్ణం గల రైతులకు 30 కేజీల బ్యాగులు మూడు మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు. అవసరమైన రైతులు మీకు దగ్గరలోని రైతు సేవా కేంద్రాలకు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, సెల్ ఫోన్ తీసుకెళ్లి బయోమెట్రిక్ ద్వారా విత్తనకాయలు పొందాలన్నారు.

దుర్వాసన భరించలేకున్నాం



మల్లికార్జునపురంలో కాలువ నిండి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

పులివెందుల రూరల్ : మండలంలోని మల్లికార్జునపురం గ్రామంలో కాలువల నుంచి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసన భరించలేకుండా ఉన్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరంతా రోడ్డుపైకి రావడంతో పాదాచారులు, వాహనదారులు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని సిబ్బందికి, అధికారులకు అనేకమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మురుగునీటి కాలువలను శుభ్రం చేసి మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం పక్కాగా అమలు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు

కడప ఎడ్యుకేషన్: కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులను అరికట్టే విధంగా చట్టాన్ని పక్కాగా అమలు చేయాలనీ ప్రగతిశీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నరేంద్ర, సుబ్బరాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. గురువారం కడప నగరంలోని ఆర్ఎస్‌పీ కార్యాలయంలో పీఎస్‌ఓ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వం కడపలో ఏర్పాటు చేసిన తెలుగు దేశం మహానాడులో విద్యారంగం, నిరుద్యోగ సమస్యలపై చర్చించక పోవడం అన్యాయం అన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలని, విద్యా సంవత్సరం ప్రారంభమైన మొదటి రోజే విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు సకాలంలో అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గోపి కేశవ, నరసింహ, గౌతమ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలపై అవగాహన

కడప కల్చరల్ : సమాజంలో పాతుకుపోయి ఉన్న పలు మూఢ నమ్మకాలపై అవగాహన కల్పించేందుకు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నామని వైవీయూ అధ్యాపకులు సునీత తెలిపారు. జన విజ్ఞాన వేదిక వేసవి వినోదం కార్యక్రమంలో శిక్షణా శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆమె మాట్లాడుతూ బాబాలు, దొంగస్వాములు, భూత వైద్యులు తమ వద్ద అదృష్ట శక్తులు, మహిమలు ఉన్నాయని ప్రజలను మోసం చేస్తున్న వారి గురించి వివరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు, ఇంద్రజాలకులు సమీర్‌బాష మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు పెరిగినపుడే ఇలాంటి అడ్డుగోడలు ఉండవని, విద్యావంతులే స్వాముల మాయలో పడుతున్నారని, శాస్త్రీయ దృక్పథం పెరగకపోతే మూఢ నమ్మకాలకు బానిస అయ్యే ప్రమాదం ఉందని ఆయన వివరించారు. మ్యాజిక్ చాకచక్యంగా చేయవలసిన శాస్త్రీయ పరిజ్ఞానమని, మ్యాజిక్ అంటే హస్తలాఘవమని ఆయన వివరించారు.

కాలువల్లో పేరుకుపోయిన చెత్త



కొత్తపల్లె గ్రామంలోని కాలువలో పేరుకుపోయిన మురుగునీరు



కొత్తపల్లెలో దర్శనమిస్తున్న చెత్తాచెదారాలు

పులివెందుల రూరల్ : ఎర్రబల్లె పంచాయతీ పరిధి కొత్తపల్లెలోని ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నారు. గ్రామంలోని కాలువల్లో మురుగునీరు, చెత్తాచెదారాలు పేరుకుపోయినా వాటిని శుభ్రం చేసే వారే కరవయ్యారు. దీంతో దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడాల్సి వస్తుందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో సైతం ఎక్కడ చూసినా మురుగునీరు పొంగిపొర్లుతోంది. అయినా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. కాలువ మురుగునీటితో నిండి ఉండటంతో పందులు తిరుగుతున్నాయి. గ్రామాల అభివృద్ధికి నిధులు ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అలాగే గ్రామంలోని వాటర్ ట్యాంక్ పాచి పట్టి ఉన్నా ఆ నీటినే గ్రామంలోని ఇళ్లకు సరఫరా చేస్తున్నారు. దీనిపై అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. సంబంధిత అధికారులకు అనేకమార్లు చెప్పినా ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కొత్తపల్లె గ్రామంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పాచిపట్టిన వాటర్ ట్యాంక్

యోగాపై శిక్షణ



యోగాసనాలు చేస్తున్న సచివాలయ, మున్సిపల్ సిబ్బంది

పులివెందుల టౌన్ : 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా గురువారం పట్టణంలోని వార్డు సచివాలయంలో యోగాపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాముడు ఆధ్వర్యంలో యోగా గురువు వెంకట్రామిరెడ్డి సచివాలయ సిబ్బందికి యోగా గురించి తెలియజేస్తూ యోగాసనాలు చేయించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి



విలేకర్లతో మాట్లాడుతున్న రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ఉక్కు పరిశ్రమ సెయిల్ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేయాలని రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక నేతలు అవ్వారు మల్లికార్జున, జే. వి. రమణ, డి. ఎం. ఓబులేసు యాదవ్, వై. ఎం .ప్రతాప్ రెడ్డి, వై మల్లయ్య లు డిమాండ్ చేశారు. గురువారం కడప ప్రకాష్ నగర్ లోని జాతీయ చేతి వృత్తుల ఐక్య వేదిక పార్టీ కార్యాలయంలో రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక నేతలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కడప మహానాడులో త్వరలో ఉక్కు పరిశ్రమ పనులు ప్రారంభిస్తామని ప్రకటించడానికి స్వాగతిస్తున్నామన్నారు. అయితే గతంలో పలుమార్లు ఇలా శంకుస్థాపన చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రులు మారుతున్నా ఉక్కు ఫ్యాక్టరీ శంకుస్థాపనకు పరిమితమైందని రాయలసీమ ప్రజలు చాలా ఆవేదనతో ఉన్నారన్నారు. ప్రవేట్ పరిశ్రమ మాకొద్దు, ప్రభుత్వ రంగంలోనే పరిశ్రమను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరాంజనేయస్వామి తిరునాల

వల్లూరు : మండలంలోని పాపాఘ్నినగర్ (కట్ట బస్టాపు) వద్ద వెలసిన శ్రీ వీరాంజనేయ స్వామి తిరునాల శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఉదయం 10 గంటలకు తాళ భజన కార్యక్రమం జరుగుతుంది. 31న ఉదయం విశేష పూజలు జరుగుతాయి. మధ్యాహ్నం 3 గంటలకు కోళాట ప్రదర్శన వుంటుంది. జూన్ 1వ తేదీన ఉదయం స్వామివారికి అభిషేకాలు, ఆకు పూజలు, విశేష పూజలు జరుగుతాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం జరుగుతుంది. 1 గంట నుండి కోళాట ప్రదర్శన జరుగుతుంది.

బండలాగుడు పోటీలు

ఉత్సవాల్లో భాగంగా 1వ తేదీ ఉదయం సేద్యపు ఎద్దులచే బండలాగుడు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30,116, ద్వితీయ బహుమతి రూ.20,116, మూడవ బహుమతి రూ.15,116, నాలుగవ బహుమతి రూ.10,116, ఐదవ బహుమతి రూ.3,116 నగదు బహుతులు అందజేయనున్నట్లు తెలిపారు.

మహానాడుకు బస్సులు.. ప్రయాణికులకు తిప్పలు



బస్సులు లేక బస్టాండులో నిరీక్షిస్తున్న ప్రయాణికులు

బద్వేలు అర్బన్ : జిల్లా కేంద్రంలో తెలుగుదేశం పార్టీ నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో భాగంగా గురువారం నిర్వహించిన బహిరంగ సభకు ఆ పార్టీ కార్యాకర్తలను తరలించేందుకు ఆర్టీసీ బస్సులను వినియోగించడంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బద్వేలు డిపో పరిధిలో దాదాపు 60 బస్సులు ఉండగా ఇందులో 35 బస్సులను మహానాడు కార్యక్రమానికి కేటాయించారు. దీంతో బద్వేలు డిపో నుండి వివిధ ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికులు బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గట్టుపల్లె, ముత్తుకూరు, సీతారామపురం, పామూరు, బి.మఠం, మైదుకూరు, కలువాయి తదితర ప్రాంతాలకు సర్వీసులను పూర్తిగా రద్దు చేశారు. అలాగే కడప, నెల్లూరులకు సైతం బస్సుల సంఖ్యను కుదించారు. వివిధ పనుల నిమిత్తం ఆయా ప్రాంతాలకు ప్రయాణం చేసేందుకు వచ్చిన ప్రజలు బస్సు అందుబాటులో లేకపోవడంతో కొందరు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించగా మరికొందరు తమ ప్రయాణాలను వాయిదా వేసుకున్నారు. అందుబాటులో ఉన్న అరకొర బస్సులలో ప్రయాణించేందుకు ప్రజలు గంటల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతిరోజూ ఆయా గ్రామీణ ప్రాంతాలకు తిరిగే బస్సులు రద్దు కావడంతో ప్రజలు ప్రమాదకర స్థితిలో ఆటోలలో ప్రయాణం చేయక తప్పలేదు.

చిరుధాన్యాలతో ఆదాయం, ఆరోగ్యం



ఫ్లెక్సీలను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

మైదుకూరు : చిరుధాన్యాలతో అటు ఆదాయం, ఇటు ఆరోగ్యాన్ని పొందవచ్చని జాతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. గురువారం మైదుకూరు మండలం వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని బద్వేలు నియోజకవర్గంలోని కలసపాడు మండలంలో ప్రారంభించారు. మండలంలోని పెండ్లిమర్రి, కలసపాడు, చెన్నేపల్లె గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో జాతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థకు చెందిన ప్రధాన శాస్త్రవేత్తలు డాక్టర్ వి.సుబ్బరాయుడు, డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, డాక్టర్ ఏవీ, డాక్టర్ ఉమాకాంత్ మాట్లాడుతూ చిరుధాన్యాల రకాలు, యాజమాన్య పద్ధతులు గురించి వివరించారు. కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ వికసిత కృషి సంకల్ప అభియాన్ ఉద్దేశాలు, కార్యాచరణ ప్రణాళిక గురించి తెలిపారు. వ్యవసాయ, ఉద్యా, పశు సంవర్ధక శాస్త్రవేత్తలు, అధికారులు ఖరీఫ్ పంటల సాగులో తీసుకోవాల్సిన మెలకువలు, యాజమాన్య పద్ధతులు, కొత్త వంగడాలు, రైతు సందేహాల గురించి వివరించారు. వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాలు జూన్ 12వ తేదీ వరకు దేశమంతా జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా వికసిత కృషి సంకల్ప అభియాన్‌కు సంబంధించిన ఫ్లెక్సీలు, పోస్టర్లను శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో మూడు గ్రామాలకు చెందిన 500 మంది రైతులు పాల్గొన్నారు.